International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.11, Issue-1, January-March, 2024
Impact Factor: 6.023; email: drtvramana@yahoo.co.in

# జానపద సాహిత్యంలోని వివిధ రూపాల్లో మహమ్మారి

**డా॥ వై.విజయానందరాజు**
తెలుగు శాఖాధిపతి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తిరువూరు

**డా॥ ఎం.మాధవి**
తెలుగు శాఖాధిపతి
జె.వి.ఆర్. ప్రభుత్వ కళాశాల, సత్తుపల్లి.

ఒక ప్రత్యేక భావ సారూప్యం కలిగిన జన సముదాయం గ్రామీణులైనా, గిరిజనులైనా జానపదులే అవుతారు. సాధారణంగా పల్లె ప్రాంతాల్లో నివశించే వారిని జానపదులు, గిరిజనులు అనుకుంటారు. కాని ప్రముఖ జానపద విద్వాంసుడు "అలెన్ దేండస్" జానపదులంటే కేవలం పల్లె ప్రజలే కాకుండా నేటి నాగరికులు, పట్టణాల్లో నగరాల్లో నివశిస్తూ జానపదుల మతాచారాలను, సంప్రదాయాలను పాటించే వారంతా కూడా జానపదులే అంటారు. ఎందుకంటే వీరంతా వంశపారంపర్యంగా వస్తున్న జానపద మూలాలను నరనరాల్లో జీర్ణించుకుని ఆచార వ్యవహారాలను కాలానుగుణంగా పాటిస్తూ వస్తారు.

ఆత్మ మనిషిని మంచిమార్గాన నడిపించడానికి శరీరాన్ని అదుపులో పెట్టుకోవడానికి మనిషికి తెలిసి అదృశ్యశక్తిని మనిషి ముందు నిలిపింది. ఈ అదృశ్య శక్తినే దైవంగా భావించడం జరిగింది. పురా మానవుడు తన నిజ జీవితంలో ఋతువుల ప్రభావంతో చెట్లు చిగురించడం, ఎండిపోవడం ప్రకృతి వైపరీత్యాల వల్ల అతివృష్టి, అనావృష్టి ఏర్పడడం దాని ద్వారా మనుషులకు అంటువ్యాదులు వ్యాపించి చనిపోవడం జరిగేది. దీనికంతటికీ కారణం ఒక అదృశ్యశక్తిగా నమ్మడం ప్రారంభించాడు. ఆ నమ్మకమే మాతృదేవతారాధనకు దారి తీసింది. మానవుడు పుట్టుకతో శక్తి, బుద్ధులను ఏ విధంగా పొందుతున్నాడో అదే మాదిరిగా ప్రకృతి నుండి తన జీవనానికి కావలసిన ఆహారాన్ని, సౌకర్యాలను పొందుతున్నాడు. తన కన్నతల్లిలాగా ప్రకృతిలోని అతీతశక్తి కాపాడుతుందని, తనని రక్షిస్తుందని భావించి తల్లి దేవతగా, మాతృదేవతగా, శక్తి దేవతగా ఆరాధించబడింది. కోరిన కోర్కెలు తీర్చేదేవతగా ప్రణమిల్లాడు. కోర్కెలు తీర్చినందుకు మొక్కులు తీర్చుకున్నాడు. అదే దేవతకు కోపం కలిగితే మహమ్మారిగా పేరు పెట్టాడు. ఆమెను శాంతింప చేయడానికి జంతుబలులు ప్రారంభించాడు.

జానపదులు కొంతమంది అనాగరిక ప్రపంచంలో అడవిలో జీవించడం వలన వారికి విద్య, ఉద్యోగం, ఆరోగ్యం మీద అవగాహన ఉండదు. ప్రకృతిలో వచ్చే మార్పులను విజ్ఞానపరంగా తెలుసుకోలేరు. మనకు ఉన్న ఆరు ఋతువులు ఆరు రకాల ధర్మాలను కలిగి ఉంటాయి. ఆహార విషయాల్లో, ప్రకృతిలో, మనిషి మానసిక స్థితి గతుల్లో ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. వర్షాకాలం రావడంతో చెట్లు చిగురించడం, వ్యవసాయపు పనులు ప్రారంభమవుతాయి. జానపదులు అడవుల్లో, కొండల్లో ఉండడం వలన రహదారులు సరిగా లేక, నీటి సౌకర్యం లేక, వైద్యసదుపాయం లేక పరిశుభ్రం పాటించకపోవడం వలన వర్షాకాలంలో అంటువ్యాధులకు కారణమైన క్రిమికీటకాదుల బారిన పడుతున్నారు. ఈ అంటువ్యాదులు ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెంది గ్రామం అంతా వ్యాపించడంతో తమను కాపాడే దేవతకు కోపం వచ్చిందని ఈ దేవతకు మహమ్మారి అని పిలవడం ప్రారంభించారు. ఈ మహమ్మారిని శాంతింపజేయడానికి పూజలు, జంతుబలులు పుట్టుకొచ్చాయి.

దీనికి ప్రతీకగా క్రీ॥శ 1815 లో మధ్యప్రదేశ్ లోని ఉజ్జయినీలో కలరా వ్యాధి సోకింది. దానితో చాలామంది మరణించారు. కాని సైన్యంలో డోలీబేరరుగా ఉన్న సురటి అప్పయ్య ప్రతిరోజు ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారికి పూజలు చేయడం వలన తనకు కలరా అనే మహమ్మారి సోకకుండా ప్రాణాలతో ఉన్నానని భావించాడు. కొద్దిరోజులకు అతనికి అక్కడి నుండి హైదరాబాదు బదిలీ అయింది. ఇక్కడ కూడా మహహ్మారి రాకూడదని సైనిక స్థావరమైన బోయగూడలో ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి విగ్రహాన్ని కర్రతో తయారుచేయించి ప్రతిష్ఠించాడు. అదే ఇప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు రాష్ట్రపండుగగా జరుపుకునే లష్కర్ బోనాల పండుగ.

మహమ్మారి అనే పదం ఎక్కువగా అంటువ్యాదులకే జానపదులు ఉపయోగిస్తారు. ఇందులో ప్రధానంగా జానపదులు వారు పూజించే దేవతకు క్రోధం పోసిందని భావించిన వారు ఈ దేవతను పోశమ్మ అని పేరుపెట్టారు. అదే మాదిరిగా వ్యాధిసోకిన పిల్లల శరీరాలపై నల్లని దద్దులు ముత్యాలవలే గుండ్రంగా ఉండుటచే ఈ వ్యాధికి సంబంధించిన దేవతను "ముతియాలమ్మ" లేదా "ముత్యాలమ్మ" గా మహమ్మారిగా పిలుస్తారు.

ఈ మహమ్మారి గురించి తెలిసిన మరియు అనుభవించిన, నమ్మిన వ్యక్తిని అడుగగా వ్యాధి సోకిన బాలునికి శరీరం పైన బొడిపెల రూపంలో అమ్మోరు కుండలు పోస్తాయి. ఇది పైకి కనిపించే మహమ్మారి. శరీరం లోపల సోకే వ్యాధిని తెలుసుకోవడం కష్టం. కడుపులో పోసే ముత్యాలమ్మ వల్ల జ్వరం, విరేచనాలు, వాంతులు కలుగుతాయి. మందుల ద్వారా తగ్గదని జానపదుల నమ్మకం. అమ్మవారిని శాంతింపజేయాలని భావిస్తారు. ఇందుకుగాను బాలుడిని అమ్మవారు పోసిందని తలచి వేపాకును పరచి శుభ్రమైన తెల్లని బట్ట పైన బాలున్ని పడుకోబెట్టి తల దగ్గర, కాళ్ళ దగ్గర వేపమండలు ఉంచుతారు. రోజు స్నానం చేయించకుండా బట్టలు మారుస్తారు. మూడవ రోజుకు తగ్గకపోతే రాత్రి నిండుబావి నీళ్ళలో పసుపు, కుంకుమ వేసి బాలుని చుట్టు తిరిగి పసుపునీళ్ళు చల్లి మిగిలినవి పచ్చని చెట్టులో పారబోయాలి. దీనిని దొంగజల్లకం అంటారు. ఐదవ రోజుకు కూడా తగ్గకపోతే తొమ్మిదవ రోజు వరకు ఆగాలి. ఇక తొమ్మిదో రోజు వేడినీళ్ళలో వేపాకు వేసి మరగబెట్టి ఉంచాలి. ఉప్పు, పసుపు, బియ్యంపిండి, వేపాకు చిగుళ్ళు మెత్తగా నూరి బాలుని శరీరానికి పూతగా పట్టించి ఒక పావు గంట సేపు ఉంచి మరిగించిన వేపకు నీటితో స్నానం చేయించాలి. ఆ విధంగా చేస్తే మహమ్మారి శాంతిస్తుందని వారి నమ్మకం.

ఈ మహమ్మారిని ఒక్కో ప్రాంతం వారు ఒక్కో పేరుతో పిలుస్తారు. సింహాద్రిపురం గూడూరు గ్రామంలో అంకాలమ్మగా పూజలు చేస్తూ గోకుడు, గజ్జీ, అమ్మవారు వంటి అంటువ్యాదుల నుండి రక్షించే దేవతగా కొలుస్తారు. రామాపురం మండలం, అనంతపురం గ్రామంలో పెద్దగంగమ్మ పేరుతో కలరా వంటి అంటువ్యాదులు సోకకుండా మొక్కులు చెల్లించుకుంటారు. సింహాద్రిపురం మండలం ఓరవగుంట పల్లె గ్రామంలో "ఓ సూరమ్మ" దేవతగా కలరా, గోకుడు వంటి వ్యాధులు రాకుండా నోములు నోచుకుంటారు. వల్లూరు మండలం గంగాయపల్లె గ్రామంలో మారెమ్మగా వెలసి గ్రహసంబంధిత వ్యాధుల భారినుండి రక్షిస్తుందని నమ్ముతారు. అదోని పట్టణంలో పూర్వకాలంలో అమ్మవారు పోసేది అనే వారు దీనినే తట్టుపోసేది అంటారు. శరీరం నిండా పెద్దపెద్దబొబ్బలు

పోసేవి. మంటగా ఉండేవి. పెద్దలు పసుపు, వేపాకులు కలిపి వేడినీటిలో వేడిచేసి తట్టు పోసిన వారికి స్నానం చేయించి ఒక పై గుడ్డ చుట్టేవారు. వారం తర్వాత అమ్మవారికి సుంకము ముద్ద ఇచ్చేవారు. ఆ తర్వాత బాలుడు ఆరోగ్యంగా తిరిగేవాడు. అందుచేత ఆ ప్రాంతం వారు ఆ అమ్మవారిని “ శ్రీ బొబ్బులమ్మ దేవత” గా పూజిస్తారు. జహీరాబాద్ పట్టణానికి 16 కి॥మీ దూరంలో కేతకీ సంగమేశ్వరాలయం ఉంది. దీని స్థలపురాణం ప్రకారం కృతయుగంలో సూర్యవంశం రాజు శ్రీకృపేంద్ర భూపాలుడు భయంకరమైన చర్మవ్యాధితో దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించినా లాభంలేదు. ఒకనాడు వేతకీవనంలోని లేడిని తరుముతూ వచ్చిన ఆ రాజు దాహం వేసి గుండంలో కనబడిన నీటిని తాగి దాహం తీర్చుకుని ఇంటికి వెళ్ళేటప్పటికి అతనికి ఉన్న చర్మరోగం అనే మహమ్మారి తగ్గిపోయిందట. అప్పటి నుండి జాతర నిర్వహించేవారు. అలాగే అల్లాదుర్గం మండల కేంద్రంలో “భేతాళస్వామిని” భూత, ప్రేతాలకు మహమ్మారికి అధిపతిగా భావించి చిన్న పిల్లలకు సోకిన భయంకర వ్యాధులు పోతాయని భావించి మొక్కులు మొక్కుకుంటారు.

మరొక మహమ్మారిగా మారమ్మ తల్లిని చెప్పుకుంటారు. జానపదులు బాలలకు ముత్యాలమ్మ అమ్మవారు తగ్గిపోయాక కుటుంబ సభ్యులలో ఎవరికో ఒకరికి కలలో కనిపించి నేను పోతున్న అని చెప్పి వెళ్ళిపోతుందని నమ్ముతారు. ఆ తర్వాత మారమ్మ వస్తుంది. తన నుండి బాలున్ని కాపాడుకొమ్మని సూచనగా భావిస్తారు. అందుకుగాను బాలున్ని బయటకు పంపకుండా గాలి, దూళి సోకకుండా జాగ్రత్త తీసుకుంటారు.

మరొక మహమ్మారిగా సందులు అనే వ్యాధిని చెప్పుకుంటారు. ఈ వ్యాధి మూడు రకాలుగా వస్తుంది. ఒకటి చికాకు సందులు, రెండు చల్దిసందులు, మూడు ఆటపాటల సందులు. ఈ వ్యాధి వచ్చినప్పుడు వాంతులు, విరేచనాలు ఏర్పడుతాయి. మెడకింద ఒక రకమైన వాసన వేస్తుంది. ఈ వ్యాధి తగ్గడానికి మెడమీద చిటికెలు వేస్తారు. అనగా పిన్నీసుతో కాల్చివాత పెడతారు. ఇంకా సంధులు పోసిన పిల్లల వయసును బట్టి ఆ వ్యాధిని తగ్గించే సంధాకులను తెచ్చి తెల్లని కొత్త వస్త్రం తెచ్చి నీటితో తడిపి పసుపు పూసి సంధాకులను నలిపి గుడ్డలో ముడివేసి సాంబ్రాణి పొగను పట్టించి బాలుని మొలతాడుకు కట్టి వీపు తరిచి వెళతారు. ఈ వ్యాధి 11 సంవత్సరముల పిల్లల వరకు వస్తుంది.

మరో మహమ్మారిగా గాలిసోకడం లేదా దయ్యంపట్టడం అని అంటారు. అకస్మాత్తుగా చనిపోవడం వలన వారి కోరికలు తీరక దయ్యాలు, భూతాలుగా మారతారని జానపదులు నమ్ముతారు. కొంతమంది ఈ వ్యాధి సోకినప్పుడు శరీరం అంతా తేలికై ఊగిపోతూ ఉంటారు. దీనినే సిగం పూనడం అంటారు. ఇంకా కొంతమంది మూర్ఛవ్యాధికి గురై వారికి తెలియని దశలో వస్తువులను తలక్రిందులు చేయడం, కదిలించడం, బట్టలు తగులబెట్టడం వంటివి చేస్తారు.

కలరా, మశూచి, తట్టు, స్పోటకపు మచ్చులు, అమ్మవారు, గజ్జి, దురద, గాలిసోకడం, మూర్ఛ, ముత్యాలమ్మ అని రకరకాలుగా వచ్చే అంటువ్యాధులనే జానపదులు మహమ్మారిగా భావించేవారు. వీటికి నివారణగా ఉపయోగించేవాటిని శాస్త్రీయంగా చూసినట్లయితే పసుపుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. పసుపులో

చాలా ఔషధ గుణాలున్నాయని ఆయుర్వేదం చెబుతుంది. అందుకే పూర్వీకులు రోగినివారినిగా పసుపు వాడేవారు. కుంకుమను నొసటన ధరించినట్లయితే నొసలు ప్రాంతం చల్లబడకుండా కాపాడుతుంది. ఇక వేపచెట్టు ఆదివాసులకు పరమౌషధం. వేప ఆకులు, చిగుళ్ళు అంటువ్యాధులు రాకుండా ఉపయోగిస్తారు. వేపనూనె క్రిమికీటకాదులను చంపుతుంది. వేపపుల్ల దంతాలకు మంచిది. వేపచెట్టు గాలి పీల్చడం వల్ల టి.బీ, ఉబ్బసం వంటి వ్యాధులు తగ్గుతాయి. అందుకే దీనిని ఆధునిక కల్పవృక్షం అంటారు. వ్యాధి సోకిన వారిని అంటు, ముట్టుడు కలుగకుండా దూరంగా ఉంచుతారు. దీనికి కారణం ఇది అంటువ్యాధి కావడం. మశూచి కలిగిన వ్యక్తిని అద్దంలో చూసుకోనివ్వరు. వారు చూసుకుంటే ముఖం బొబ్బలతో, మచ్చలతో ఉండటం వలన వికారంగా కన్పిస్తుంది. దీనితో రోగి మానసికంగా కృంగిపోతాడని అద్దంలో చూసుకోనివ్వరు. ఇవన్నీ శాస్త్రీయంగా ప్రాచీన కాలం నుంచి ఆచరిస్తున్న సంప్రదాయాలే.

ప్రస్తుత కాలంలో మహమ్మారిగా మార్మోగిపోతున్న ఆధునిక వ్యాధి కరోనా. దీనికి గాను ప్రాచీనకాలం నుండి వస్తున్న ఆచార సంప్రదాయాలు ఆధునిక ప్రపంచానికి అలవాటు పడటం వలన నిర్లక్ష్యం ఏర్పడింది. ఈ వ్యాధి వలన మళ్ళీ మళ్ళీ వాటిని ఆచరించడం ప్రారంభించాము. కాళ్ళు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, కరచాలనం కాకుండా నమస్కరించడం, వేడి నీటిలో పసుపు కలుపుకుని త్రాగడం వంటి వాటిని ఆచరించడం వలన కరోనా మహమ్మారిని ఆహ్వానించకుండా మనల్ని మనం రక్షించుకుంటూ మరొకరికి సోకనివ్వకుండా జాగ్రత్త పడదాం.

**ఉపయుక్త గ్రంధాలు:**

1) తెలంగాణ సంస్కృతి –కళలు – జూలూరి గౌరిశంకర్, పెన్న శివరామకృష్ణ

2) తెలుగు కథాసాహత్యం – గిరిజన జీవితం – డా॥జి. శైలమ్మ.

3) కడప జిల్లా గ్రామ దేవతలు – డా॥యస్. పద్మనాభరెడ్డి.

4) బోనాల ప్రదర్శన కళారూపాలు – డా॥ సుతారి లక్ష్మీనారాయణ

5) గ్రామదేవతలు – సవ్వప్పగారి ఈరన్న.